క్లుప్తంగా

వైభవంగా వనువులమ్మ జాతర



జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన వేషధారణలు

మామిడికుదురు: పెదపట్నంలో కొలువుదీరిన వనువులమ్మ జాతర గురువారం రాత్రి వైభవంగా జరిగింది. చిత్ర విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పుల నడుమ జాతర మహోత్సవం ఆద్యంతం వైభవంగా జరిపించారు. శుక్రవారం అమ్మవారికి నైవేద్యాలు చెల్లించారు. శనివారం అమ్మవారి తీర్థం జరుగుతుందని ఆలయ కమిటీ పేర్కొంది. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు భక్తులను మంత్రముగ్ధుల్ని చేశాయి. జాతరలో భాగంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత



అవిడిలో డ్రైడే ర్యాలీలో డీఎంఓ భరతలక్ష్మి

కొత్తపేట: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా మలేరియా అధికారి (డీఎంఓ) భరతలక్ష్మి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన డ్రైడే కార్యక్రమాల్లో డీఎంఓ డాక్టర్ భరతలక్ష్మి పాల్గొన్నారు. పీహెచ్‌సీ వద్ద నుంచి డ్రైడే ర్యాలీ నిర్వహించారు. ఫ్రైడే-డ్రైడేగా పాటిద్దాం.. దోమలను నిర్మూలిద్దాం.. అంటూ నినాదాలు చేశారు. పలు కూడళ్లల్లో పరిసరాల పరిశుభ్రత, దోమల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. భరతలక్ష్మి మాట్లాడుతూ దోమల పెరుగుదల-నిర్మూలన, దోమల వలన వచ్చే వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్, ఎస్‌పీఓ రాజబాబు, ఎంపీహెచ్‌ఎస్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో వేంచేసిన శ్రీ, భూ సమేత జనార్దనస్వామి ఆలయంలో జరుగుతున్న కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన గాత్ర కచేరి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్థానిక ఆలయ ఆవరణలో వేద పండితులు ద్విభాష్యం రవికృష్ణశర్మ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ గాత్ర కచేరిలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ గాయని చిట్టూరి రాధ పాల్గొని భక్తి కీర్తనలు ఆలపించారు. సరస్వతి నమోస్తుతే, శంకరాభరణం, మోహనరాగం ఆదితాళం తదితర రాగాలు భక్తులను అలరించాయి. అనంతరం గాయని రాధను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

సంఘాభివృద్ధికి కృషి చేయాలి



అంబాజీపేటలో గోవిందుతో పాటు సభ్యులను సన్మానిస్తున్న సంఘ నాయకులు

అంబాజీపేట: నూతనంగా ఎన్నికైన సభ్యులు సంఘాభివృద్ధికి, బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీ ఎరుకల సంక్షేమ సంఘ గౌరవ అధ్యక్షుడు అమలదాసు సూర్యనారాయణ అన్నారు. జిల్లా ఏపీ ఎరుకల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా ఎన్నికైన మానుపాటి గోవిందును అంబాజీపేటలో సంఘ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. అంతకుముందు స్థానిక బస్టాండ్ వద్ద ఏకలవ్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సమతం పాపారావు, బందారు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్లకోమా వ్యాధితో అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు: వయస్సు పైబడిన వారికి తరచూ సంభవించే గ్లకోమా వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీ శంకర్, నేత్ర వైద్య నిపుణురాలు కె.శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక ఎస్‌బీపీబీకే కల్యాణ మండపంలో శుక్రవారం గ్లకోమా వ్యాధి లక్షణాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వారు వివరించారు. తీవ్రమైన కంటినొప్పి, తలనొప్పి, వికారం వాంతులు కాని సంభవిస్తే సత్వరమే సమీప వైద్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. అలాగే చూపు మందగించినా, వెలుతురు చుట్టూ రంగుల వలయాలు ఏర్పడినా కంటి వైద్య నిపుణులు వద్ద చికిత్స చేయించుకోవాలన్నారు. అనంతరం గ్లకోమా వ్యాధిపై అవగాహన కలిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఏదైనా వ్యాధికి చికిత్స చేయించుకుని యాంటీబయాటిక్స్ వాడితే వైద్య పరీక్షలు చేయించుకోవాలని వారు సూచించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్ ఈ ఏవీవీ రాజా, ఎల్‌టీ సీహెచ్.రమేష్, హెల్త్ అసిస్టెంట్ వి.సుబ్బారావు, ఫార్మసిస్టు సుగుణ లక్ష్మి, వైద్య సిబ్బంది లక్ష్మి రత్నకుమారి పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్.. సేవలు సూపర్

- విజయవంతమైన కార్యక్రమం
- ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది
- హర్షం వ్యక్తం చేస్తున్న రోగులు



చిరతపూడిలో రోగులకు మందులు అందిస్తున్న వైద్య సిబ్బంది

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం విజయవంతమైంది. గత ఏడాది అక్టోబర్ 22న ప్రారంభించిన ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంతో ప్రతి గ్రామంలో క్యాంపులు నిర్వహించడంతో నిరుపేద రోగులకు పూర్తి స్థాయి వైద్యం అందుతుంది. రోగుల ముంగిటకే కార్పొరేట్ స్థాయిలో పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఫ్యామిలీ ఫిజీషియన్‌తో పాటు 104 వాహనంలో డాక్టర్, వైద్య సిబ్బంది తరలివెళ్లి సచివాలయాల పరిధిలోని ఆరోగ్య కేంద్రంలో రోగులను పరీక్షించి మందులు అందజేస్తున్నారు. నడవలేక ఆరోగ్య కేంద్రానికి రాలేనివారు, పక్షవాతంతో బాధపడుతున్న వారి ఇంటికి స్వయంగా డాక్టర్ వైద్యసిబ్బంది వెళ్లి రోగిని పరీక్షించి మందులు అందజేస్తుండటంతో రోగులు కోలుకుంటున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో స్థానిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు డాక్టర్లను పూర్తిస్థాయిలో నియమించడంతో ఒకరు పీహెచ్‌సీలోను, మరొకరు ఫ్యామిలీ ఫిజీషియన్ క్యాంప్‌ను విధులు నిర్వహించడంతో రోగులకు అందుబాటులో ఉంటున్నారు. కొత్తపేటలో 26, రావులపాలెంలో 23, ఆలమూరులో 24, ఆత్రేయపురంలో 26, రాజోలులో 20, మలికిపురంలో 22, సఖినేటిపల్లిలో 20, అంబాజీపేటలో 19, పి.గన్నవరంలో 23, మామిడికుదురులో 22, అయినవిల్లిలో 22 సచివాలయాల పరిధిలోని ఆరోగ్య కేంద్రాల్లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందిస్తున్నారు. రోగులకు సంబంధించి సుమారు 67 రకాల మందులను, 14 రకాల వైద్య పరీక్షలను డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ద్వారా అందిచనున్నారు. ప్రతి గ్రామాన్ని నెలలో రెండు సార్లు సందర్శిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య సేవలు అందిస్తారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు గ్రామంలోని ఆరోగ్యశ్రీ రోగులను పరీక్షిస్తారు. అంగన్‌వాడీ, పాఠశాలలు, విద్యార్థులను, చిన్నారులను పరీక్షించి మందులు అందజేస్తారు. వచ్చే నెల 6 నుంచి పూర్తి స్థాయిలో సచివాలయంలో నెలకు రెండు సార్లు సంర్శించి రోగులకు మెరుగైన సేవలు అందించనున్నారు. ఇప్పటి వరకు ఫ్యామిలీ ఫిజీషియన్ ట్రయల్ రన్ నిర్వహించారు. ఈ పథకం గ్రామీణ ప్రాంతంలో సక్సెస్ అవ్వడంతో పూర్తి స్థాయి వైద్యాన్ని అందించేందుకు వైద్యాధికారులు సిద్ధపడుతున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం భేష్



ఫ్యామిలీ ఫిజీషియన్ విధానం బాగుంది. ఇంటింటికీ వెళ్లి రోగులను పరీక్షించడం ద్వారా అనేక విషయాలు తెలుసుకుంటున్నాం. స్వయంగా ఓ డాక్టర్ రోగి ఇంటికి వెళ్లి పరీక్షించడంతో వారు కూడా చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే నెల 6 నుంచి రోగులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటూ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు వెళ్లి పరీక్షలు నిర్వహిస్తాం.

– వి.గౌతమి, వైద్యాధికారిణి, పీహెచ్‌సీ, అంబాజీపేట

రోగులకు వరం



గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు ఫ్యామిలీ ఫిజీషియన్ ఒక వరం. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలతో పాటు అన్ని వర్గాల ప్రజల ఆరోగ్యాన్ని అందిచేలా సీఎం జగన్ తీసుకున్న నిర్ణయం ఎంతో మంది పేదలకు మేలు చేస్తుంది. ప్రజల చెంతకే వైద్యం అందించడం హర్షణీయం. ప్రభుత్వ డాక్టర్ ఇంటికి వచ్చి పరీక్షించడమనేది నాకు తెలిసి ఇదే మొదటిసారి. నాలాంటి రోగులకు ఇదో వరం లాంటిది.

– కోట సత్తిబాబు, అంబాజీపేట

నేడు మహాజన సభ

అంబాజీపేట: స్థానిక సొసైటీలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మహాజన సభ నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్‌పర్సన్ కొర్లపాటి కోటబాబు శుక్రవారం తెలిపారు. ఈ సభలో జమా ఖర్చులు, సభ్యులు తొలంగిపు, చేర్పులు, ఆడిట్ రిపోర్ట్‌లను ఆమోదిస్తారన్నారు. సొసైటీ పరిధిలోని రైతులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

ఈనెల 20 నుంచి ఆధార్ శిబిరాలు

మామిడికుదురు: ఈ నెల 20వ తేదీ సోమవారం నుంచి మండలంలో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేశామని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 20, 21, 27, 28 తేదీల్లో మామిడికుదురు-1, మామిడికుదురు-2 సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ సేవలను ప్రజలలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

23లోగా దరఖాస్తు చేసుకోవాలి

పి.గన్నవరం: నరేంద్రపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీషు మీడియంలో చేరేందుకు అర్హత గల విద్యార్థులు ఈనెల 23 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నక్కా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత విద్యార్హత పత్రాలతో పాటు, పాస్‌పోర్టు ఫొటో, ఆధార్, రేషన్ కార్డుల జిరాక్స్ కాపీలతో తమను సంప్రదించాలని ఆయన సూచించారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



కొత్తపేట మండలం వాడపాలెం లాకుల వద్ద నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, డీఈఈ శ్రీనివాసరావు

కొత్తపేట: ప్రస్తుత రబీ పంటకు సాగునీటి సమస్య పరిష్కరించేందుకు ఉన్నత స్థాయిలో చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీపీ మార్గన గంగాధరరావు, ఇరిగేషన్ శాఖ అమలాపురం డీఈఈ బి.శ్రీనివాసరావు రైతులకు హామీ ఇచ్చారు. బొబ్బర్లంక-ముక్తేశ్వరం ప్రధాన పంటకాలువ వాడపాలెం లాకులపైన వాడపాలెం ఓల్డ్ చానల్, న్యూ చానల్ ద్వారా సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు చానల్స్ కింద సుమారు 1600 ఎకరాలు వరి పంట సాగుచేస్తుండగా గత కొన్ని రోజులుగా పంటకు తగినంత నీరు అందడంలేదని ఆ రైతుల ఆవేదనను ఎంపీపీ గంగాధరరావు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అసెంబ్లీ సమావేశాలు పురస్కరించుకుని విజయవాడలో ఉన్న జగ్గిరెడ్డి వెంటనే స్పందించి కాన్ఫరెన్స్‌లో ఇరిగేషన్ ఎస్ఈతో మాట్లాడారు. అధికారులను పంపించి సమస్య సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు శుక్రవారం ఉదయం డీఈఈ శ్రీనివాసరావు వాడపాలెం లాకు వద్దకు చేరుకుని సాగునీరు పరిస్థితి, నీటి మట్టం పరిశీలించారు. అక్కడ ఎంపీపీ వాడపాలెం ఓల్డ్, న్యూ చానల్స్ ద్వారా సాగునీటి కొరతను వివరించారు. అనంతరం ఎంపీపీ, డీఈఈ రైతులతో కలసి క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిశీలించారు. న్యూ చానల్ ప్రారంభంలో మెరకగా ఉన్నందున పెదపేట రోడ్డు వరకూ జేసీబీ పెట్టి పూడిక తీసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులను ఆదేశించారు. కొత్తపేట శివారు పనసలదొడ్డి ప్రాంతానికి వెళ్లి నీరు లేక బీటలు తీసిన చేలను పరిశీలించారు. ఈ పరిస్థితిని డీఈఈ ఫోన్‌లో ఉన్నతాధికారులకు వివరించారు. ప్రస్తుతం దాదాపు మొత్తం ఆయకట్టు ఈనిక పూర్తయి పాలుపోసుకునే దశలో ఉన్నందున, ఈ సమయంలో పంట నష్టం వాటిల్లకుండా నీరందించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సూచనపై వాడపాలెం లాకుల వద్ద వంతు ఈ నెల 22న కాగా రెండు రోజులు ముందుగా 20న వంతు కట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు. 24 గంటల వంతును 48 గంటలకు పెంచి, 7.5 అడుగుల నీటి మట్టం అమలు చేస్తామన్నారు. ఆయిలు ఇంజిన్లకు ఒక తడుపుకు 3 లీటర్లు ఇస్తుండగా ఇక్కడ 5 లీటర్లు ఇస్తామని, అవకాశం ఉన్న రైతులు ఆయిలు ఇంజిన్ల ద్వారా నీరు తోడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు నేలపూడి భీమరాజు, వాడపాలెం రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు, పీఏసీఎస్ పర్సన్ దంగేటి సుబ్రహ్మణ్యం, వానపల్లి వైఎస్సార్ సీపీ నాయకుడు దుప్పలపూడి మాధవరావు, ఇరిగేషన్ కొత్తపేట ఎస్ఓ వి.నవీన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతో అభివృద్ధికి పాటుపడాలి



మండల సమావేశంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీపీ అంబటి భూలక్ష్మి

పి.గన్నవరం: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ అంబటి భూలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. కుందాలపల్లిలో ప్రాథమిక పాఠశాల ఆవరణ కొద్దిపాటి వర్షానికే నీట మునిగిపోతుందని సర్పంచ్ పప్పుల శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. నాడు-నేడు నిధులతో పాఠశాలను అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని ఎంఈఓ కోన హెలీనా అన్నారు. ముంగండపాలెంలో లోవోల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు ఆందోళన వ్యక్తం చేశారు.

కుందాలపల్లి, నరేంద్రపురం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు పాత వైర్లను మార్చి కొత్త వైర్లు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ పప్పుల సాయిబాబు కోరారు. వివిధ సమస్యలపై శాఖల వారీగా ఎంపీపీ చర్చించారు. పలు సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, ఎంపీడీఓ టీఎస్ వెంకటాచార్య, సర్పంచ్, ఎంపీటీసీల సమాఖ్యల అధ్యక్షులు తోలేటి బంగారునాయుడు, ఆదిమూలం సూరయ్యకాపు, ఎస్సై పి.గంగాభవాని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



మామిడికుదురులో గృహ సారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న పార్టీ నేతలు

మామిడికుదురు: సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని వైఎస్సార్ సీపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్య కుమార్, జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఎండీవై షరీఫ్ సూచించారు. స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో శుక్రవారం జరిగిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తల సమావేశానికి మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి భగవాన్ అధ్యక్షత వహించారు. ఆదిత్యకుమార్, షరీఫ్ మాట్లాడుతూ శనివారం నుంచి ప్రారంభమయ్యే జగనన్నే మా నమ్మకం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ జరగని రీతిలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాల ఫలాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. వీటిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. సమావేశంలో మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ సిర్రా మణికుమార్, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, ఎంపీటీసీ వర్ధినేని రాము, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, కంచి శ్రీరామ్, నైనాల శివ, మొల్లేటి సత్యనారాయణ, నైనాల రామకృష్ణ, రామేశ్వరపు పోతన, నయినాల రామకృష్ణ పాల్గొన్నారు.

రైతుల మేలు కోసమే జగనన్న భూహక్కు



పసుపల్లిలో సర్వే రాళ్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ మంగతాయారు

అంబాజీపేట: భూవివాదాలు లేకుండా శాశ్వతంగా భూ హక్కు పత్రాలను రైతులకు అందజేసి వారికి మేలు చేయడమే లక్ష్యంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టారని తహసీల్దార్ టి.మంగతాయారు అన్నారు. పసుపల్లిలో జగనన్న భూరక్ష పథకంలో భాగంగా భూ సరిహద్దుల్లో సర్వే రాళ్లను నాటే విధానాన్ని తహసీల్దార్ శుక్రవారం పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటికే ముక్కామలలో సర్వే రాళ్లు వచ్చాయన్నారు. వీటిని రెవెన్యూ సిబ్బంది నిబంధనల ప్రకారం సూచించిన చోట ఏర్పాటు చేస్తారన్నారు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం ద్వారా భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. భూములను రీ సర్వే చేసి పారదర్శకంగా రికార్డులను రూపొందించారన్నారు. సరిహద్దుల్లో రాళ్లను పాతుకునే సమయంలో రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వోలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి

అంబాజీపేట: కె.పెదపూడిలో ఆరోగ్య సబ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ విధులకు ఆటంకం కలిగిస్తూ వేధింపులకు గురిచేసిన సంఘటనపై నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్ డిమాండ్ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీని శుక్రవారం మానవ హక్కుల వేదిక సభ్యులు కలిశారు. వారు మాట్లాడుతూ ఎంఎల్‌హెచ్‌పీని వేధింపులకు గురిచేసిన సర్పంచ్ భర్త, వార్డు సభ్యుడు బీర రాజారావు, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.మధుబాబులపై చర్యలు తీసుకోవాలన్నారు. వీరితో ఎటువంటి సంబంధం లేని వారితో మాత్రమే విచారణ కమిటీ సభ్యులుగా నియమించి బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. రాజేష్‌తో పాటు జిల్లా కార్యవర్గ సభ్యులు కె.పుష్పవల్లి, పి.పవన్ పాల్గొన్నారు.

గృహసారథులే విజయానికి వారధులు



వక్కలంకలో గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు

అంబాజీపేట: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి వివరించి, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి వారధులుగా పనిచేయాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, పార్టీ యువ నాయకుడు కొండేటి వికాస్‌బాబు అన్నారు. వక్కలంకలో జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్ అధ్యక్షతన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్ మానసపుత్రిక అయిన వలంటీర్ వ్యవస్థకు అనుబంధంగా గృహ సారథులు కూడా ఇంటింటికి తిరిగి ప్రజల్లో మమేకం కావాలన్నారు. ఈ నెల 18 నుంచి నిర్వహించే జగనన్న మా భవిష్యత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గృహ సారథులకు కిట్లను పంపిణీ చేశారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి పెదబాబు అధ్వర్యంలో జరిగిన సమావేశంలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి, ఎంపీటీసీ పిల్లి సత్యవేణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వాసంశెట్టి రాంబాబు, జనుపల్లి ఏడుకొండలు, వాసంశెట్టి వెంకటశెట్టి, యల్లమిల్లి జయబాబు, నాగాబత్తుల రాజేష్ పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ లక్ష్యాలను అధిగమించాలి



ఆలమూరులో నిర్వహించిన ఆయుష్మాన్ భారత్ సమీక్షకు హాజరైన సచివాలయ ఉద్యోగులు

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అర్హులైన వారందరికి వర్తింపజేయాలని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ అన్నారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ రాజ్‌కుమార్ అధ్యక్షత వహించగా ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్య సిబ్బందికి విధిగా మహిళ సంరక్షణ కార్యదర్శులు సహకరించాలన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ప్రజా సంక్షేమ పథకాలను అందించాలన్నారు. అనంతరం గ్రామాల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులను సమీక్షించారు. గ్రామ సంచాయతీ కార్యదర్శులు కె.సంజీవ్‌రెడ్డి, ఆర్‌వీవీ సత్యనారాయణ, శ్యామ్‌సుందర్, కె.మోక్షాంజలి, ఎస్.వీర్రాజు, యు.రేణుక, సుప్రియ, వెంకటరెడ్డి, అయ్యన్న, సీహెచ్ వీరమాత, వేణు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జనరల్ సెక్రటరీగా 'రౌతు'



రౌతు ఈశ్వర రావు (ఫైల్)

రావులపాలెం: నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) కోనసీమ జిల్లా జనరల్ సెక్రటరీగా రౌతు ఈశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్‌హెచ్‌ఆర్‌సీ చైర్మన్ పి.సంపత్‌కుమార్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘన సమస్యలపై తమ సంఘ సభ్యులతో కలసి పోరాడుతామన్నారు. తనకు అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడు అడబాల సాయికి కృతజ్ఞతలు తెలిపారు.

రేపు ఉగాది సాహితీ సభ, కవి సమ్మేళనం

కళాసాహితి లోగో

కొత్తపేట: శ్రీశోభకృత్ నామ సంవత్సరం ఉగాది సాహితీ సభ, కవి సమ్మేళనం కార్యక్రమాలు ఆదివారం స్థానిక ఎంవీఎస్ సుబ్బరాజు కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్టు కళాసాహితీ అధ్యక్షుడు పెన్మెత్స హరిహరదేవళరాజు, ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు తెలిపారు. కొత్తపేటలో 1989 ఉగాది సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎంవీఎస్ సుబ్బరాజు అధ్యక్షుడిగా, ప్రముఖ కవి, రచయిత గిడ్డి సుబ్బారావు ప్రధాన కార్యదర్శిగా, పలువురు స్థానిక కవులు, రచయితలు, సాహితీవేత్తలు సభ్యులుగా 'కళాసాహితి' ఏర్పడింది. అప్పటి నుంచి ఏటా క్రమం తప్పకుండా ఉగాది సాహితీ సభలు, కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు ముఖ్యఅతిథిగా పాల్గొనేవారు. ఎంవీఎస్ సుబ్బరాజు మరణానంతరం పెన్మెత్స హరిహరదేవళరాజు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల నుంచే కాక రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి కవులు, కళాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటారు. దానిలో భాగంగా ఈ ఏడాది 35వ సాహితీ సభ, కవి సమ్మేళనం ఏటా కంటే ఘనంగా నిర్వహించనున్నారు. ఆ ఏర్పాట్లపై శుక్రవారం సాయంత్రం సుబ్బారావు స్వగృహంలో దేవళరాజు, సభ్యుడు ఏబీసీ దేవ్ తదితరులు చర్చించారు. బహుభాషా కోవిదుడు, ప్రియదర్శినీ బాలవిహార్ వ్యవస్థాపకుడు అద్దంకి కేశవరావు రచనలు అశోకుడు (ఏకపాత్ర), గౌతమ కల్యాణం (నృత్యరూపకం) ఆవిష్కరణ కార్యక్రమం, అనంతరం కవి సమ్మేళనం జరుగుతుందని ఆయన తెలిపారు. కవులు, కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విఘ్నేశ్వరునికి పంచామృతాభిషేకం

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామికి శుక్రవారం పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి పంచామృతాభిషేకం జరిపారు. అధిక సంఖ్యలో స్వామిని భక్తులు దర్శించుకున్నారు.

మాస్ కాపీయింగ్ లేకుండా పరీక్షలు నిర్వహించాలి

అంబాజీపేట: వచ్చే నెల 3న జరిగే పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలు నిర్వహించాలని ఎంఈఓ జేవీ కనకదుర్గ అన్నారు. అంబాజీపేట ఎంఆర్సీ భవనంలో పరీక్ష కేంద్రాల హెచ్ఎంలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ అంబాజీపేట, పుల్లేటికుర్రు, తొండవరం జెడ్పీ హైస్కూళ్లలో నిర్వహించే పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించే వారి వివరాలు ఇవ్వాలని సూచించారు. పదిలో నూటికి నూరు శాతం విజయం సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు, తొండవరం కేంద్రాల్లో పరీక్ష 542 మంది రెగ్యులర్, 238 సప్లమెంటరీ విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. అంబాజీపేటలో 306, పుల్లేటికుర్రులో 262, తొండవరం 222 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారన్నారు. సమావేశంలో హెచ్ఎంలు మోకా ప్రకాష్, ఏవీఎల్ వరప్రసాద్, ఎంఎస్ శ్రీనివాస్, సీఆర్పీలు ఎస్.వెంకటేష్, టి.నాగరాజు, పి.గోవిందరాజు, ఎం.దుర్గారావు, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

పుల్లేటికుర్రు ఏవీఎస్ జూనియర్ కళాశాల, అంబాజీపేట ఎస్ఎస్ఎం కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియెట్ పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ టి.మంగతాయారు శుక్రవారం పరిశీలించారు. పుల్లేటికుర్రు ఏవీఎస్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ 271 మంది, అంబాజీపేట ఎస్ఎస్ఎం కళాశాలలో 131 మంది హాజరయ్యారు.

మహిళల అభ్యున్నతిలో డ్వాక్రా సంఘాలదే పాత్ర



ఆలమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ క్రాంతి పథం ఉద్యోగులు, డ్వాక్రా సంఘ మహిళలు

ఆలమూరు: మహిళల అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన సాధించేందుకు డ్వాక్రా సంఘాలు కీలకపాత్ర పోషించాలని ఏపీఎం ఎం.ధనరాజు, సూపర్‌వైజర్ పీవీ రమణారావు అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం వద్ద మండల సమాఖ్య అధ్యక్షురాలు జి.ఉమాశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళ సదస్సులో వారు పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీనిధి, ఉన్నతి, బ్యాంకు లింకేజీ రుణాలు, జగనన్న తోడు, వైఎస్సార్ చేయూత తదితర పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టిని పొందాలన్నారు. అలాగే గ్రామాల్లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను నిరోధించి బాల్య వివాహాలను అరికట్టాలని మహిళ సంఘాలకు వివరించారు. బడి ఈడు పిల్లలను బడిలోనే చేర్పించాలని, మధ్యలో చదువు మానేసిన విద్యార్థులను బడికి పంపాలంటూ ర్యాలీ నిర్వహించారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి



లక్కవరంలో ర్యాలీలో పాల్గొన్న ఎస్సై శాస్త్రి, సర్పంచ్ పుష్పకుమారి

మలికిపురం: మహిళలు అన్ని విధాలుగా అప్రమత్తంగా ఉండాలని మలికిపురం ఎస్సై హరికోటి శాస్త్రి సూచించారు. శుక్రవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో లక్కవరంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై పాల్గొని మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు, బాల్య వివాహాల నిరోధం, వంటి సమస్యలపై ఆయన ప్రసంగించారు. డీఆర్‌డీఏ వెలుగు సిబ్బంది, పీహెచ్‌సీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏఎస్సై సత్యనారాయణ, సర్పంచ్ కోట పుష్పకుమారి, వైద్యాధికారి దుర్గాప్రసాద్, సమాఖ్య అధ్యక్షురాలు సుమలత, ఏపీఎం వరాలబాబు, వీవోఏ సువర్ణకుమారి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.